క్లుప్తంగా

వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును విరమించుకోవాలి



జగ్గంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

జగ్గంపేట: ముస్లింల హక్కులకు భంగం కలిగించే వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును తక్షణమే కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేస్తు జగ్గంపేటలో శుక్రవారం ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక సున్నిజామియా మసీదు నుంచి మెయిన్‌రోడ్డు మీదగా ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ అధ్యక్షుడు ఎస్‌ఏ గఫూర్ మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు వెనుక కుట్ర దాగి ఉందన్నారు. విలువైన వక్ఫ్ ఆస్తులను కాజేయాలని బీజేపీ నేతలు ఈ బిల్లును తీసుకువచ్చారని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాల అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోకపోవడం దారుణమన్నారు. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును అంగీకరించమని తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం నేతలు షేక్ ఆరిఫ్, డాక్టర్ బాషా, షేక్ మొహిద్దీన్, ఎస్‌కే వల్లీ, ఎండీ ఖాజా, జానీ తదితరులు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

ప్రత్తిపాడు: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు తెలిపారు. ఈ శిబిరంలో గ్రామ సచివాలయ సిబ్బందితో పాటు వివిధ శాఖల ఉద్యోగులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వేమవరంలో రక్తదాన శిబిరం

తొండంగి: మండలంలోని వేమవరంలో శుక్రవారం ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. స్ఫూర్తి ఫౌండేషన్ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ శిబిరంలో తీరప్రాంత గ్రామాలకు చెందిన 108 యువకులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో సప్తగిరి హేచరీస్ అధినేత పెదబాబు, ఫౌండేషన్ నిర్వాహకుడు ఎస్.శ్రీనివాసరావు, యువత పాల్గొన్నారు.


తిరుమల పవిత్రతను దెబ్బతీసేందుకు కుట్ర

జగ్గంపేట: తిరుమల తిరుపతి దేవస్థానం పవిత్రతను దెబ్బతీసేందుకు కుట్రలు జరుగుతున్నాయని టీటీడీ బోర్డు మెంబర్, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. జగ్గంపేటలో టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు.
తిరుపతి గోశాలలో గోవులు చనిపోతున్నాయని కొంతమంది తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. నిజానికి తిరుమల తిరుపతి దేవస్థానానికి మూడు గోశాలలు ఉన్నాయని, వీటిలో నెలకు 15 గోవులు పుడుతుండగా, వివిధ కారణాలతో నెలకు 12 గోవులు మృతి చెందుతున్నాయని వివరించారు. టీటీడీ మాజీ చైర్మన్ భూమాన కరుణాకర్‌రెడ్డి దీనిపై అసత్య ప్రచారం చేయడం సరికాదన్నారు. వచ్చే బోర్డు మీటింగ్‌లో అసత్య ఆరోపణలు చేస్తున్న భూమన కరుణాకర్‌రెడ్డిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తానని తెలిపారు. కూటమి ప్రభుత్వం అన్ని మతాలను గౌరవిస్తూ లౌకికతత్వాన్ని ప్రోత్సహిస్తుందన్నారు. దానికి నిదర్శనం పాస్టర్లకు నెలకు రూ.5 వేలు గౌరవ వేతనం విడుదల చేయడమేనని తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం

ప్రత్తిపాడు రూరల్: క్రీడలతో మానసికోల్లాసం పెంపొందుతుందని మాజీ ఎంపీపీ సత్యశెట్టి సీతబాబు అన్నారు. మండలంలోని ఒమ్మంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ కాకినాడ సన్ రైజ్ ఆధ్వర్యంలో షటిల్ బాడ్మింటన్, టెన్నికాయిట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతబాబు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలన్నారు. పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో శ్రీకృష్ణ వర్మ, రంగారావు, క్లబ్ సెక్రటరీ టి.సాయి సుందర్, ఎలెక్ట్ ప్రెసిడెంట్ సెనెటర్ శామ్యూల్, ఎలెక్ట్ సెక్రటరీ ఎం.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జింబాబ్వే స్వాతంత్య్ర వేడుకలు



స్వాతంత్య్ర వేడుకల్లో జింబాబ్వే విద్యార్థులు

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో శుక్రవారం జింబాబ్వే స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో జింబాబ్వే విద్యార్థులు తమ దేశ సంస్కృతి, సంప్రదాయ నృత్యాలతో ఆద్యాంతం అలరించారు. జెండా వందనం అనంతరం జాతీయ గీతం ఆలపించారు. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ రిలేషన్ డైరెక్టర్ పరంజిత్ సింగ్, సీనియర్ మేనేజర్, ఇంటర్నేషనల్ అడ్మిషన్స్ మహమ్మద్ సమీమ్ జాఫర్, పవన్ కుమార్, జింబ్వాబేకు చెందిన విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలకు ఎగనామం

- పన్నులు చెల్లించని సెల్ టవర్ యజమాన్యాలు
- కేవలం జీపీ అనుమతులతో ఏర్పాటు
- ఆదాయం కోల్పోతున్న గ్రామ పంచాయతీలు

ప్రత్తిపాడు: రూ.కోట్లలో వ్యాపారం చేస్తున్న సెల్ టవర్ యజమాన్యాలు గ్రామ పంచాయతీలకు ఏడాదికోసారి చెల్లించాల్సిన పన్నులను ఎగ్గొడుతున్నాయి. ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో పలు కంపెనీలకు చెందిన సుమారు 60 వరకు సెల్ టవర్లున్నాయి. ఎప్పుడు ఇంటి పన్నుల కోసం వెంటపడే పంచాయతీ సిబ్బంది టవర్లకు సంబంధించిన పన్నుల వసూలు కోసం ఎందుకు ప్రయత్నించడం లేదనే ఆరోపణలున్నాయి. నియోజకవర్గంలో సెల్ టవర్ల మూలంగా పంచాయతీలకు ఏడాదికి సుమారుగా రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకు ఆదాయం కోల్పోతున్నాయి. మండల కేంద్రమైన ప్రత్తిపాడులోనే నాలుగు సెల్ టవర్లున్నాయి. ప్రత్తిపాడు మండలంలోని ప్రత్తిపాడు, ధర్మవరం గ్రామాల్లో నాలుగేసి, చినశంకర్లపూడి, చింతలూరు గ్రామాల్లో రెండేసి, ఒమ్మంగి, పోతులూరు, వాకపల్లి గ్రామాల్లో ఒక్కొక్కటి వెరసి 15 సెల్ టవర్లున్నాయి. వీటితో పాటు నియోజకవర్గంలోని ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండలాల్లో సుమారు 45 వరకు సెల్ టవర్లను ఏర్పాటు చేశారు. ఈ టవర్లు ఏర్పాటు చేసి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు ఆయా పంచాయతీలకు ఒక్క పైసా కూడా పన్ను చెల్లించలేదు. ఆయా కంపెనీల ఒప్పందాలు ఒక్క టవర్‌కే పరికరాలు అమర్చుకుని కోట్లలో వ్యాపారం చేస్తున్నారు.

టవర్ ఏర్పాటు చేసే స్థలంలోనే..

టవర్ ఏర్పాటు చేసే స్థలంలో టవర్‌తో పాటు జనరేటర్, గది నిర్మాణం అంతా కలిపి సుమారు 300 గజాల నుంచి 400 గజాల స్థలంలో చుట్టూ ప్రహరీతో ఉన్నాయి. పంచాయతీ లెక్కల ప్రకారం ఎంత చిన్న పంచాయతీ అయినప్పటికీ ఏడాదికి కనీసం రూ.1000కి పైగా పన్ను చెల్లించాల్సి ఉంటుంది.

అనుమతులతో పాటు రూ.10 వేలు

సెల్ టవర్ నిర్మాణానికి ముందుగా టవర్ ఏర్పాటు చేసిన స్థలానికి సంబంధించిన పత్రాలతో పాటు పంచాయతీ అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలి. పంచాయతీకి రూ.10 వేలు రుసుం కట్టాల్సి ఉంటుంది. సొమ్ము చెల్లించగానే రసీదు ఇచ్చి అక్కడున్న విస్తీర్ణాన్ని బట్టి ఏడాదికి ఎంత పన్ను అనేది నిర్ణయిస్తారు. ఆ తర్వాత ప్రతి ఏడాదికి టవర్ల నుంచి పన్ను కట్టించుకోవాలి. కానీ ఇక్కడ అలా జరగడం లేదు. సెల్ టవర్‌కు అద్దెకు ఇచ్చేవారు పంచాయతీ సిబ్బందితో ఒప్పందం కుదుర్చుకుని అనుమతి పొందుతున్నారు. దీంతో పంచాయతీకి రావాల్సిన ఆదాయానికి గండి పడుతోంది.



ప్రత్తిపాడులోని సెల్ టవర్

పన్నులు వసూలు చేస్తాం



సెల్ టవర్లు ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇప్పటి వరకు రావాల్సిన బాకాయిలు వసూలు చేస్తాం. టవర్ యజమాన్యాలకు నోటీసులిస్తాం. అంతే కాకుండా డిమాండు రిజిస్టర్లలో పొందుపరచి ప్రతి ఏడాది బకాయిల జాబితాలో కనిపించేలా చర్యలు తీసుకుంటాం. పంచాయతీలకు ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకుంటాం.
– ఎంవీఆర్ కుమార్ బాబు, మండల అభివృద్ధి అధికారి, ప్రత్తిపాడు

పార్టీ విజయానికి కృషి చేయాలి



కిర్లంపూడిలో ముద్రగడ గిరిబాబును కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు

కిర్లంపూడి: వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. పార్టీ ప్రత్తిపాడు మండల నూతన కమిటీ ఉపాధ్యక్షుడు కిలాడి బాబ్జీ, ఎగ్జిక్యూటివ్ మెంబర్ సానా పోలరాజు శుక్రవారం కిర్లంపూడిలోని ముద్రగడ నివాసంలో గిరిబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని ముద్రగడ గిరిబాబు శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కష్టపడి పనిచేసిన వారిని పార్టీ గుర్తించి ఉన్నత పదవులు ఇస్తుందన్నారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేసి పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. అనంతరం వారు గిరిబాబును సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. జువ్వల చినబాబు, రాపా గుర్రాజు, ఎంటి వీర్రాజు, గదుల శివ తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



కాకరాపల్లిలో నేలకొరిగిన వరిపంటను పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ నేత లంక ప్రసాద్

కోటనందూరు: అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు లంక ప్రసాద్ కోరారు. మండలంలోని కాకరాపల్లిలో ఇటీవల కురిసిన వర్షాలకు నేలకొరిగిన రబీ వరిపంటను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలతో కాకినాడ జిల్లా వ్యాప్తంగా రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఎకరాకు రూ. 40 వేల వరకూ పెట్టుబడి పెట్టి సాగు చేసిన వరిపంట నేలకొరిగి మొలకెత్తుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక్క కోటనందూరు మండలంలోనే 150 ఎకరాల వరి పంట పాడైపోయిందన్నారు. పంట నష్టంపై అధికారులతో సమగ్ర సర్వే చేయించి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కార్యదర్శి దేవారపు శ్రీను, రైతులు గంటా కొండబాబు, దేవారపు నాగన్నదొర తదితరులు పాల్గొన్నారు.

రత్నగిరిపై అమ్మవార్లకు చండీహోమాలు



వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై కొలువైన వనదుర్గ, కనక దుర్గ అమ్మవార్లకు శుక్రవారం చండీహోమాలు నిర్వహించారు. కనకదుర్గ అమ్మవారి జన్మనక్షత్రం 'మూల' సందర్భంగా కొండదిగువన తొలిపాంచా వద్ద కొలువైన అమ్మవారి ఆలయంలో పండితులు కుంకుమపూజలు నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు వనదుర్గ, కనక దుర్గ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి చండీ హోమాలు ప్రారంభించారు. 11 గంటలకు హోమ గుండాలలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవార్లకు నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేదపండితులు గొల్లపల్లి ఘనపాఠి, ఉపాధ్యాయుల రమేష్, కోట వంశీ, చిట్టెం హరగోపాల్, చెల్లపిళ్ల ప్రసాద్, దేవులపల్లి ప్రకాష్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమాలు నిర్వహించారు. హోమంలో 50 మంది భక్తులు పాల్గొన్నారు. సత్యదేవుని ప్రధానాలయంలో దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి ఆధ్వర్యంలో పండితులు కుంకుమ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

గోకవరం: ఆర్టీసీ ఉద్యోగుల జాబ్ భద్రతా సర్క్యులర్ 1/2019ను వెంటనే అమలు చేయాలని గోకవరం ఆర్టీసీ డిపో నేషనల్ మజ్దూర్ యూనియన్ చైర్మన్ కొమరపురి శ్రీనివాస్‌రావు, సెక్రటరీ ఎంఎస్ నారాయణ డిమాండ్ చేశారు. పలు డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ ఈ నెల 28, 29న అన్ని ఆర్టీసీ డిపోల్లో నిరసన కార్యక్రమాలు, దీక్షలు చేపట్టాలని రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిందన్నారు. అక్రమ సస్పెన్షన్లు, అక్రమ తొలగింపులను వెంటనే ఆపాలని, గత నాలుగు సంవత్సరాలుగా ఆగిపోయిన ప్రమోషన్లు ఇవ్వాలని, గ్యారేజీ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని, మహిళా ఉద్యోగులకు పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలని, ఉద్యోగుల అనారోగ్య సెలవులకు పూర్తి జీతం చెల్లించాలని తదితర డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ ఆందోళన చేపడతామని చెప్పారు. తక్షణమే ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

రత్నగిరి సూపరింటెండెంట్ రామారావు బదిలీ

అన్నవరం: స్థానిక వీరవేంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఐవీ రామారావును ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల దేవస్థానానికి బదిలీ చేస్తూ దేవదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. రెండేళ్లపాటు అక్కడే విధులు నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా రామారావు దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావుకు అత్యంత సన్నిహితుడిగా దేవస్థానం వర్గాలు పేర్కొంటున్నాయి. ఆలయ నిర్వహణలో ఏమాత్రం అనుభవం లేని ఈఓ తీసుకున్న అనేక వివాదాస్పద నిర్ణయాల వెనుక రామారావు పాత్ర ఉందని చెబుతున్నారు. తనకు అప్పగించిన సెక్యూరిటీ, కౌంటర్లు, ఇతర విధుల నిర్వహణలో సిబ్బందిని ఇబ్బందులకు గురి చేయడంతో పాటు తాను ఒక రోజు ఇన్‌చార్జిగా వ్యవహరించిన ఇతర శాఖల సిబ్బందిని ఇబ్బందులకు గురిచేశాడని చెబుతున్నారు. దీనిపై పలువురు సిబ్బంది పజాప్రతినిధులకు ఫిర్యాదు చేయడంతో ఈ మేరకు వారు కమిషనర్‌కు సిఫార్స్ చేయడంతో రామారావును బదిలీ చేసినట్లు సమాచారం.

త్వరలో దేవస్థానం పెద్ద అధికారి మీద బదిలీ వేటు..?

రత్నగిరి దేవస్థానానికి చెందిన మరో పెద్ద అధికారిపై కూడా అతి త్వరలో బదిలీ వేటు పడనుందని సమాచారం. దేవస్థానంలో అతని కుమారుడి పెత్తనంపై 'చినబాబు వచ్చారు బహుపరాక్' శీర్షికన 'సాక్షి'లో మంగళవారం ప్రచురితమైన వార్తతో పాటు గతంలో వచ్చిన కథనాలు, ఆ అధికారి తీసుకున్న పలు వివాదాస్పద నిర్ణయాలు, దేవదాయశాఖ ఉన్నతాధికారులపై చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై ఆ శాఖ ఉన్నతాధికారులు ఆగ్రహంతో ఉన్నట్టు సమాచారం. ఈ విషయం పసిగట్టిన ఆయన తన బదిలీ జరగకుండా కూటమిలోని కీలకమైన నాయకులను ప్రసన్నం చేసుకునే ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలిసింది.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అస్సాగో ఇథనాల్ పరిశ్రమలో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

తుని: పట్టణంలోని బహుళ అంతస్తు భవనాలు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో అగ్నిప్రమాదాల నివారణపై శుక్రవారం తుని అగ్నిమాపక అధికారి కె.రాముడు అవగాహన కల్పించారు. ఆర్‌ఎస్ పేటలోని పాండురంగా ప్రజా వైద్యశాలలో గ్యాస్ ప్రమాదం జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలను మాక్ డ్రిల్ ద్వారా వివరించారు. ఆసుపత్రిలోని అన్ని అంతస్తుల్లో ఫైర్ ఫైటింగ్ పరికరాలను ఎప్పటికప్పుడు పరిశీలించి లోపాలను సరిదిద్దుకోవాలని సూచించారు.

అస్సాగోలో అగ్నిమాపక దినోత్సవం

గోకవరం: మండలంలోని గుమ్మళ్లదొడ్డి పంచాయతీ పరిధిలోని అస్సాగో ఇథనాల్ పరిశ్రమలో శుక్రవారం అగ్నిమాపక దినోత్సవాన్ని నిర్వహించారు. స్థానికులకు అగ్నిప్రమాదాల నివారణపై కోరుకొండ అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పించారు. దీనిలో భాగంగా వివిధ ప్రదర్శనలు, అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో అస్సాగో పరిశ్రమ సిబ్బంది ఈడీ జి.వెంకటేశ్వరరావు, శుక్లా, హెచ్‌ఆర్ చంద్రశేఖర్, భవానీ శంకర్, అగ్నిమాపక అధికారులు కేవీవీ సత్యనారాయణ, దివాకర్, అప్పన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: అగ్ని ప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ప్రత్తిపాడు అగ్ని మాపక కేంద్రం ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ ఎంజి రత్నరాజు అన్నారు. అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా ప్రత్తిపాడు జాతీయ రహదారిపై గల దీప్తి సర్వీసింగ్ సెంటర్ (ఇండియన్ ఆయిల్ బంకు) వద్ద శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుడాల వెంకటరత్నం, ఫైర్‌మెన్లు కేఎస్ఎన్ మూర్తి, పి.సూర్యనారాయణ, టి.దుర్గాప్రసాద్, కె.వేణు, రాఘవులు పాల్గొన్నారు.

ఘనంగా మండలాభిషేకం



కాట్రావులపల్లిలో వేంకటేశ్వరస్వామికి మండలాభిషేకం చేస్తున్న పండితులు, పాల్గొన్న దంపతులు

జగ్గంపేట: మండలంలోని కాట్రావులపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం మండలాభిషేకం అత్యంత వైభవంగా నిర్వహించారు. 100 మంది దంపతులు పాల్గొని స్వామివారికి పంచామృతాభిషేకం, హోమాలు నిర్వహించారు. కాట్రావులపల్లిలో పురాతన వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని పునఃప్రతిష్ఠించి 40 రోజులు పూర్తయిన సందర్భంగా మండలాభిషేక మహోత్సవాన్ని నిర్వహించారు. శనివారం మహాశాంతి హోమం, మహాపూర్ణాహుతి, స్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది. ఆలయ పునప్రతిష్ఠ కార్యక్రమం, క్రతువులను దిగ్విజయంగా నిర్వహించిన పండితుడు పాణింగిపల్లి పవన్‌కుమార్ ఆచార్యులును ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు. ఆయనకు సువర్ణ కంఠాభరణాన్ని అందజేసి ఆగమరత్నం బిరుదుతో సన్మానించారు.

600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రత్తిపాడు: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని శంఖవరం మండలం వజ్రకూటంలో సారా స్థావరాలపై శుక్రవారం దాడులు నిర్వహించినట్టు స్థానిక ఎక్సైజ్ సీఐ పి. శివప్రసాద్ తెలిపారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 600 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు చెప్పారు. ఎక్సైజ్ ఎస్సై పున్నం వంశీరామ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు

- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- గ్రామాల్లో ఏసు సిలువతో ర్యాలీలు



ఏలేశ్వరంలో ఊరేగింపు నిర్వహిస్తున్న క్రైస్తవులు



కిర్లంపూడిలో ర్యాలీ చేసి సిలువ సువార్తను ప్రకటిస్తున్న నాగభూషణం

ఏలేశ్వరం: ఏసుక్రీస్తుకు శిలువ వేసిన రోజును పురస్కరించుకుని శుక్రవారం నియోజకవర్గవ్యాప్తంగా గుడ్ ఫ్రైడే (శుభ శుక్రవారం) వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏలేశ్వరంలో పాస్టర్ థామస్ ఆధ్వర్యంలో ఆర్‌సీఎం చర్చి నుంచి మెయిన్ రోడ్డు, మార్కెట్ రోడ్డు, బాలాజీ చౌక్, హనుమాన్ జంక్షన్ తదితర ప్రాంతాల మీదుగా ఊరేగింపు నిర్వహించారు. మండల పరిధిలోని గ్రామాల్లో గుడ్ ఫ్రైడే వేడుకలు నిర్వహించారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వచ్చే ఆదివారం ఈస్టర్ కావడంతో సమాధులను శుభ్రం చేస్తున్నారు.

ప్రత్తిపాడు: మండలంలోని ప్రత్తిపాడు, కిర్లంపూడి, పెదశంకర్లపూడి, చినశంకర్లపూడి, లంపకలోవ, టి.రాయవరం, ఏలూరు తదితర గ్రామాల్లో గుడ్ ఫ్రైడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రత్తిపాడులోని ఆర్‌సీఎం చర్చి, బిలీవర్స్ బాప్టిస్ట్, సెంటినరీ బాప్టిస్ట్ చర్చి, హోప్ ఫౌండేషన్ చర్చి, లైట్ ఫర్ ది లాస్ట్ (ఎల్‌ఎఫ్‌టీఎల్) బాప్టిస్ట్ చర్చి తదితర చర్చిల్లో ఫాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దివ్యబలి పూజ, ఉపవాస ఆరాధనల్లో క్రైస్తవులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రత్తిపాడు సెంటినెరీ బాప్టిస్ట్ చర్చి, బిలీవర్స్ బాప్టిస్ట్ చర్చిల్లో గుడ్ ఫ్రైడే ఆరాధనలో భాగంగా సప్త సూక్తులను చర్చి ప్రతినిధి జి.సుందర్రావు, మద్దా చంద్రపాల్ వివరించారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

స్థానిక ఆర్‌సీఎం చర్చిలో విచారణ కర్త కె.చిన్నప్ప ఆధ్వర్యంలో ఆరాధన నిర్వహించారు. ఆర్‌సీఎం చర్చి నుంచి క్రీస్తు శిలువ వృత్తాంతాన్ని వివరిస్తూ పుర ప్రదర్శన నిర్వహించారు. శరీరంపై గాయాలతో నెత్తిన ముళ్ల కిరీటం ధరింపజేసి, శిలువను భుజాన మోస్తూ క్రీస్తును నడిపించిన భటుల ప్రదర్శన గ్రామస్తులను విశేషంగా ఆకట్టుకుంది. స్థానిక ఆర్‌సీఎం చర్చి నుంచి మరియగిరి వరకూ కొనసాగిన శిలో మార్గంలో క్రైస్తవ సోదరులు, మఠకన్యలు పాల్గొన్నారు. మార్గం మధ్యలో అంబేడ్కర్ కళామందిర్, అల్లూరి జంక్షన్, తోట కాలనీ, ఇందిరా కాలనీ తదితర 14 ప్రదేశాలల్లో నిజరూప దృశ్య మాలికలను ప్రదర్శించారు. మరియగిరిపై ఏసుక్రీస్తు శిలువ ఘట్టాన్ని ప్రదర్శించారు. క్రీస్తుగా జి.పాండు, తల్లి మరియగా ఎం.జ్యోతి, ఏసుకు శిక్ష విధించిన జడ్జి పిలాతుగా కె.శ్రీను, యోహానుగా పి. గుణకోవిందు, పుణ్య స్త్రీలుగా డి.లోవకుమారి, అమలమేరి, భటులుగా కె.రాజేష్, పి.విన్నీ వేషధారణలు ధరించారు.

కిర్లంపూడి: గుడ్ ఫ్రైడేని పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గ్రామాల్లో క్రైస్తవులు ర్యాలీలు నిర్వహించారు. కిర్లంపూడిలోని ఇమ్మానుయేలు ప్రార్థన మందిరం పాస్టర్ నాగభూషణం ఆధ్వర్యంలో సంఘ సభ్యులు గ్రామంలో ర్యాలీ చేసి సిలువ సువార్తను ప్రకటించారు. సంఘ పెద్దలు మూరా చంటిబాబు, చార్లెసు శ్రీను, నాగు, మూరా నవీన్, ఆశోక్, బంగారు సింహాచలం తదితరులు ఉన్నారు.

క్రైస్తవుల ర్యాలీ

తొండంగి: గుడ్ ఫ్రైడే సందర్భంగా మండలంలోని బెండపూడిలో శుక్రవారం క్రైస్తవులు ర్యాలీ నిర్వహించారు. పీఎస్పీ చర్చిలో ప్రపంచశాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే తొండంగి, గోపాలపట్నం, ఎ.కొత్తపల్లి, పెరుమాళ్లపురం, దానవాయిపేట, రావికంపాడు తదితర గ్రామాల్లోనూ క్రైస్తవులు ప్రార్థనలు, ర్యాలీలు నిర్వహించారు.

శంఖవరం: మండలంలోని కత్తిపూడి, శంఖవరం గ్రామాల్లో క్రైస్తవులు గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసుక్రీస్తు సిలువతో ఊరేగింపు నిర్వహించారు. పాస్టర్ చిటికల రాజకుమార్ పాల్గొన్నారు.

సత్యదేవుని సన్నిధిలో రైల్వే డీఆర్‌ఎం పూజలు



సత్యదేవుని సన్నిధిలో డీఆర్‌ఎం నరేంద్ర పాటిల్, ఇతర అధికారులు

అన్నవరం: దక్షిణ మధ్య రైల్వే డివిజనల్ మేనేజర్ (డీఆర్‌ఎం) నరేంద్ర పాటిల్ కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేయగా సత్యదేవుని ప్రసాదాలను ఈఓ వీర్ల సుబ్బారావు అందజేశారు. ఆయన వెంట పలువురు రైల్వే ఉన్నతాధికారులు ఉన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కోటనందూరు: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై టి.రామకృష్ణ సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక పోలీసుస్టేషన్‌లో శుక్రవారం సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఆధునిక టెక్నాలజీ వృద్ధి చెందుతున్న తరుణంలో సైబర్ నేరాలు భారీగా పెరిగిపోతున్నాయన్నారు. ప్రధానంగా ఆర్థిక మోసాలు, సోషల్ మీడియా ద్వారా మోసపూరిత ప్రలోభాలు, వ్యక్తిగత సమాచారం అపహరణ, ఫేక్ లింకుల ద్వారా డేటా హ్యాకింగ్ వంటి మోసాలపట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యక్తిగత డేటా, బ్యాంకు సమాచారం, ఓటీపీలు ఎవరికీ చెప్పకూడదన్నారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు డి.పోలవరంలో ప్రజాదర్బారు

తుని రూరల్: మండలంలోని డి.పోలవరంలో శనివారం ఎమ్మెల్యే యనమల దివ్య ప్రజా దర్బారు నిర్వహించనున్నట్టు క్యాంపు కార్యాలయ ప్రతినిధులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే ప్రజాదర్బారులో ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. మండల స్థాయి అధికారులు పాల్గొంటారన్నారు. 20న ఉదయం 11 గంటలకు దొండవాక పంచాయతీ శివారు గ్రామం బీఎస్.పేటలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభిస్తారని చెప్పారు.

కార్పొరేషన్ రుణ ప్రణాళికలపై సమీక్ష

తుని రూరల్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఇతరేతర కార్పొరేషన్ల ద్వారా అందించే రుణ ప్రణాళికపై మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు సమీక్షించారు. శుక్రవారం తేటగుంట క్యాంపు కార్యాలయంలో తుని, కోటనందూరు, తొండంగి మండలాల ఎంపీడీఓలు, తుని పురపాలక సంఘం కమిషనర్‌తో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పేదరిక నిర్మూలనే లక్ష్యంగా రుణ లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయాలన్నారు. నిర్ణీత గడువులోగా రుణాలు మంజూరు, యూనిట్లు స్థాపన జరగాలన్నారు. జిల్లా డిప్యూటీ కలెక్టర్ రామలక్ష్మి యనమలను కలిశారు. గ్రామ, వార్డు సచివాలయాలలో ఖాళీలు ఆధారంగా సిబ్బందిని సర్దుబాటు చేయాలని సూచించారు.

పదో తరగతి విద్యార్థులకు కౌన్సెలింగ్

శంఖవరం: స్థానిక కేజీబీవీలో పదో తరగతి పరీక్షలు రాసి ఫలితాల కోసం నిరీక్షిస్తున్న విద్యార్థులకు శుక్రవారం సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా మానసిక ఆరోగ్య నిపుణులు కుసుమ మాట్లాడుతూ విద్యార్థులకు పరీక్షలే జీవితం కాదన్నారు. జీవితం ఎంతో విలువైనదని, పరీక్షల ఫలితాలు, గెలుపు–ఓటములు చిన్న మజిలీలు మాత్రమే అన్నారు. విద్యార్థుల భవిష్యత్ ప్రణాళికలకు ప్రేరణ కలిగించారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ బాలామణి, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ డీలర్లపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు



ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు ఫిర్యాదు చేస్తున్న మహిళలు

జగ్గంపేట: గ్రామంలోని రేషన్ షాపుల డీలర్లు, రేషన్ సరఫరా వాహనదారులు తమకు రేషన్ బియ్యం ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని పలువురు మహిళలు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు ఫిర్యాదు చేశారు. జగ్గంపేటలోని టీడీపీ కార్యాలయానికి వివిధ ప్రాంతాలకు చెందిన మహిళలు శుక్రవారం వచ్చి రేషన్ డీలర్లు, రేషన్ వాహనదారులు పెడుతున్న ఇబ్బందులను తెలిపారు. బియ్యం స్టాక్ లేదని, కేజీకి రూ.13 ఇస్తామని చెబుతున్నారన్నారు. దీనిపై తహసీల్దార్‌తో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడారు. తక్షణమే రేషన్ షాపులు, వాహనాలను సీజ్ చేయాలని ఆదేశించారు. రేషన్ షాపుల్లో స్టాక్ ఎంత ఉంది, ఎంత మందికి రేషన్ ఇచ్చారో విచారణ చేసి తేడాలుంటే తక్షణమే నిందితులను సస్పెండ్ చేయాలని సూచించారు. రేషన్ బియ్యం అమ్మిన, కొన్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

ఘనంగా భగవద్గీత పారాయణ

ఏలేశ్వరం: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని దుర్గాదేవి ఆలయం వద్ద శుక్రవారం పలు పారాయణలు చేశారు. మత్స్య జయంతిని పురస్కరించుకుని విశ్వహిందూ పరిషత్ మండల కార్యదర్శి కటకం కిరీటీ ఆధ్వర్యంలో మహిళలు భగవద్గీత, హనుమన్‌చాలీసా, విష్ణుసహస్రనామార్చన, గోవింద నామాలు, భక్తిగీతాలు ఆలపించారు. కార్యక్రమంలో పరిషత్ సభ్యుడు ఉడతల రమణారావు, మహిళలు గిరిజ, సూర్యకుమారి, మల్లేశ్వరీ, ముచ్చర్ల రాజి, శారద, లలిత, రమ్యపాల్గొన్నారు.